


మా కలం.. మీ వజ్రాయుధం..

APTEL 2022 / 16169

# టుడే పల్లె సాక్షి

తెలుగు దిన పత్రిక

pallesakshi2022@gmail.com

youtub : pallesakshi news








PUBLISHED FROM : AMARAVATHI, VIJAYAWADA, HYD, KURNOOL, NANDYALA, KADAPA, ANANTAPUR, CHITOOR, ALL DISTRICTS IN ANDHRA PRADESH & TELANGANA

| కర్నూలు : ఎడిటర్ : వి.లింగమూర్తి | సంపుటి : 5 సంచిక : 88 | పేజీలు : 8 | వెల రూ.4/- | email : pallesakshi2022@gmail.com | మంగళవారం 25-08-2026 |
|---|---|---|---|---|---|


## స్వదేశీ పరిజ్ఞానంతో ఆహార భద్రత సాధించడం...

# అత్యంత కీలకం..!!

ఏలూరు జిల్లా నూజివీడు నియోజక వర్గంలోని ముసునూరులో నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించారు.

### ఏలూరు జిల్లాలో నూతన మొక్కజొన్న వంగడాన్ని ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి

- “వ్యవసాయ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఇది ముఖ్యమైన ముందడుగు
- రైతులు మొక్కజొన్న సాగు చేస్తూ మంచి లాభాలు ఆర్జిస్తున్నారు
- పాప్‌కార్న్ ఎగుమతి చేసే స్థాయికి దేశం ఎదుగుతుంది
- వ్యవసాయాభివృద్ధికి సీఎం చంద్రబాబు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయం
- నదుల అనుసంధానంతో అన్ని జిల్లాలకు సమగ్ర సాగునీటి సౌకర్యాలు అందుతాయి
- భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్



**ఏలూరు:** స్వదేశీ పరిజ్ఞానంతో ఆహార భద్రత సాధించడం అత్యంత కీలకమని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఏలూరు జిల్లా ముసునూరులో గౌర్మెట్ పాప్‌కార్నికా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన మొక్కజొన్న వంగడాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడారు. “వ్యవసాయ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఇది ముఖ్యమైన ముందడుగు. రైతులు మొక్కజొన్న సాగు చేస్తూ



మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. పాప్‌కార్న్ ఎగుమతి చేసే స్థాయికి దేశం ఎదుగుతుంది. వ్యవసాయాభివృద్ధికి సీఎం చంద్రబాబు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయం. నదుల అనుసంధానంతో అన్ని జిల్లాలకు సమగ్ర సాగునీటి సౌకర్యాలు అందుతాయి” అని ఉపరాష్ట్రపతి అన్నారు.





## చెత్త కొండ కూలిపడి..

# 30 మంది దుర్మరణం..!!

### గినియా రాజధాని కోనక్రీలో ఘోర ప్రమాదం

- ఈ ఘటనలో మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు
- ప్రమాదం జరిగిన వెంటనే రంగంలోకి సహాయక బృందాలు
- శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించేందుకు చర్యలు
- ఈ డంపింగ్ యార్డ్‌ను మూసివేయాలని అధికారులు నిర్ణయం

గినియా రాజధాని కోనక్రీలో ఘోర ప్రమాదం జరిగింది. నగరంలో ఉన్న అతిపెద్ద డంపింగ్ యార్డ్‌లో ‘కొండలా పేరుకుపోయిన చెత్త’ ఒక్కసారిగా కూలిపోయింది. అది సమీపంలోని పూరి గుడిసెలపై పడటంతో 30 మంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో నగరంలో భారీ వర్షం కరిసింది. దీంతో ఈ చెత్త కొండ విరిగిపడినట్లు తెలిపారు. ఈ డంపింగ్ యార్డ్‌ను మూసివేయాలని ఆదివారమే అధికారులు నిర్ణయించారు. పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు ఖాళీ చేయాలంటూ ముందే నోటీసులు జారీ చేశారు. కొందరు అక్కడి నుంచి వెళ్లిపోగా.. మరికొందరు ఖాళీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈలోపే ప్రమాదం జరిగి 30 మంది ప్రాణాలు కోల్పోవడం విషాదకరం.




## తెలంగాణపై...

# ఏంటీ వివక్ష?

- గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి..
- నన్ను అడ్డుకుంటారా?: సీఎం రేవంత్ రెడ్డి
- భాజపా నేతలు నా పర్యటనపై తప్పుదోవ పట్టించారు!
- ‘రాజకీయ కారణం’ అంటే ఏమిటి?
- నన్ను అడ్డుకున్నా.. లక్ష్యాన్ని అడ్డుకోలేరు
- మోదీ పాక్ వెళ్లొచ్చు.. మేం అమెరికా వెళ్లకూడదా?
- తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని ఖండించాలి

**హైదరాబాద్:** వికసిత్ భారత్ లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ 2047 పేరిట పెట్టుబడుల ఆకర్షణకు తలపెట్టిన తన అమెరికా పర్యటనను కేంద్రం అడ్డుకోవడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ సీఎంకు అనుమతి ఇవ్వకపోవడం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. తెలంగాణ సీఎంను అడ్డుకోవడం స్పష్టమైన రాజకీయ వివక్ష అన్నారు. ఇది రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనని తెలిపారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు అమెరికా పర్యటనకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎంను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం, ప్రధాని మోదీ పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకోనేందుకు కుట్ర చేశారని సీఎం ఆరోపించారు.

**భాజపా నేతలు నా పర్యటనపై తప్పుదోవ పట్టించారు!...** లండన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, భాజపా నేతల తీరును ప్రశ్నించారు. “రాష్ట్రాలకు కేంద్రం సహకరించకపోవడం మన


..2వ పేజీలో


## ఆ ఎన్నికల షెడ్యూల్ ఫేక్.. షేర్ చేస్తే

# కఠిన చర్యలు

- ఏపీలో స్థానిక ఎన్నికల షెడ్యూల్ పేరుతో దుష్ప్రచారం జరుగుతోంది
- సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు
- కొందరు షేర్ చేస్తున్నది ఫేక్ షెడ్యూల్...
- అందులో ఎలాంటి వాస్తవం లేదు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్‌చంద్ర పునేఠా



**విజయవాడ:** ఏపీలో స్థానిక ఎన్నికల షెడ్యూల్ పేరుతో దుష్ప్రచారం జరుగుతోందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు. సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. ఈ మేరకు ఎస్ఈసీ ఓ ప్రకటన విడుదల చేశారు. “స్థానిక ఎన్నికల షెడ్యూల్ పేరుతో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోంది. అధికారిక గుర్తులను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. ఈ ప్రచారం నిజమా? కాదా? అనే విషయంపై వివరణ కోరుతూ వివిధ వర్గాల నుంచి పెద్ద ఎత్తున ఎన్నికల కమిషన్ కార్యాలయానికి ఫోన్ కాల్స్ వస్తున్నాయి. కొందరు షేర్ చేస్తున్నది ఫేక్ షెడ్యూల్. అందులో ఎలాంటి వాస్తవం లేదు. వాట్సప్‌లో వస్తున్న ఎన్నికల తేదీలను నమ్మొద్దు.. ఇతరులకు ఫార్వర్డ్ చేయొద్దు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఫేక్ షెడ్యూల్‌ను షేర్ చేసే వారిపై సైబర్ చట్టాల కింద కేసులు నమోదు చేస్తాం. స్థానిక ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని పత్రికా ప్రకటన/మీడియా సమావేశం ద్వారానే వెల్లడిస్తాం. రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు అనధికారిక సమాచారాన్ని విశ్వసించవద్దు” అని అనిల్‌చంద్ర పునేఠా స్పష్టం చేశారు.

## అల్పపీడనం ఎఫెక్ట్..!!

## ఏపీలోని ఈ ప్రాంతాల్లో వర్షాలు..


..2వ పేజీలో





## డేటా ఆధారిత పాలనను మరింత..

# బలోపేతం చేయాలి..!!

- పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్ష..
- ఆస్పత్రుల డేటా విశ్లేషణపై ఆ శాఖ అధికారులతో చర్చలు..
- రేషన్ పంపిణీ డేటా విశ్లేషణపై అధికారులతో చర్చలు..
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



డేటా ఆధారిత పాలనను మరింత బలోపేతం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సోమవారం రాజధాని అమరావతిలో రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**అమరావతి :** డేటా ఆధారిత పాలనను మరింత బలోపేతం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సోమవారం రాజధాని అమరావతిలోని సచివాలయంలో ఆయన అధ్యక్షతన రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. అలాగే సచివాలయంలో Data Driven Decision Making పై మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. Data Lake పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. AI Living Labs, AI Stack అమలుపై సమీక్షించారు. అలాగే WhatsApp Governance ‘మన మిత్ర’ సేవలపై చర్చించారు. Aware ప్లాట్‌ఫామ్ పని తీరును కూడా సీఎం చంద్రబాబు సమీక్షించారు. పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించారు. ఆస్పత్రుల డేటా విశ్లేషణపై ఆ శాఖ అధికారులతో చర్చించారు. MEPMA సేవల పనితీరుపై సమీక్షించారు. RoR Mutation ప్రక్రియ పురోగతిపై సీఎం ఆరా తీశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్లు, రీ-సర్వే అంశాలపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. F-Line Survey పురోగతిని కూడా సమీక్షించారు. రేషన్ పంపిణీ డేటా విశ్లేషణపై అధికారులతో చర్చించారు. ఈ సమీక్షకు RTGS, ITE&C, రెవెన్యూ, విద్య, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారుల హాజరయ్యారు.

పల్లె సాక్షి



# తెలంగాణపై ఏంటీ వివక్ష?

**(మొదటిపేజి తరువాయి)** సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. విద్యలో సహకారం, పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికా పర్యటన తలపెట్టాను. బ్రిటన్‌కు అనుమతించి.. అమెరికా పర్యటనను కేంద్రం నిరాకరించింది. పెట్టుబడులు సాధన కోసం గతంలోనూ విదేశాలకు వెళ్లాం. కానీ ఈసారి లండన్‌కు అనుమతించి అమెరికా వెళ్లకుండా చేశారు. కేంద్రం వైఖరిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ శ్రేణులతో పాటు విద్య, క్రీడల విధానాలు, పెట్టుబడుల విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా యువతకు మేలు జరుగుతుందని భావించిన కోట్లాది మంది తప్పుబట్టారు. కేంద్ర విదేశాంగ శాఖ నా పర్యటనను తిరస్కరించడంతో పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ నేతలు కొందరు నా పర్యటన వివరాలను తప్పుదారి పట్టించేలా, వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ మాట్లాడారు. భాజపా నేతల గురించి నేను మాట్లాడదలచుకోలేదు. ఇది రెండు ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులకు సంబంధించిన అంశం. రాజకీయ అంశాల జోలికి వెళ్లకుండా ప్రభుత్వాలు నిర్వహించాల్సిన బాధ్యత గురించి కేంద్రానికి గుర్తు చేయదలచుకున్నాను. కొందరు భాజపా నేతలు నా అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పి తప్పుదోవ పట్టించారు.

**'రాజకీయ కారణం' అంటే ఏమిటి?...** నా విదేశీ పర్యటనలో ఎలాంటి గోప్యత లేదు. విదేశీ పర్యటనకు దరఖాస్తు చేసినప్పుడు అన్ని విషయాలూ స్పష్టంగా పేర్కొన్నాం. విద్య, క్రీడలు, రాష్ట్రంలో పెట్టుబడులకు అమెరికాలో ప్రఖ్యాత వర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని చెప్పాం. కానీ, రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు విదేశాంగ శాఖ బదులిచ్చింది. యూకే, యూఎస్ పర్యటనకు ఒకే తరహా వివరాలు ఇచ్చాం. నా పర్యటన మొత్తం షెడ్యూల్‌ను విదేశాంగ శాఖ ముందు ఉంచాం. బ్రిటన్ పర్యటనకు ఓకే చెప్పి.. అమెరికా పర్యటనను మాత్రం ఎందుకు అడ్డుకున్నారు. రాజకీయ కారణంతో అనుమతి ఇవ్వడంలేదని విదేశాంగ శాఖ బదులిచ్చింది. రాజకీయ కారణం అంటే ఏమిటీ? నేను తెలంగాణ సీఎంను.. కాంగ్రెస్ సీఎంను కావడమే కారణమా? ఒక సీఎం విదేశాలకు వెళ్తే విదేశీ రాయబారులు వెంటే ఉంటారు. ప్రతి కార్యక్రమాన్ని భారత రాయబార అధికారులు పర్యవేక్షిస్తారు.

**నన్ను అడ్డుకున్నా.. లక్ష్యాన్ని అడ్డుకోలేరు...** కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా.

**మోదీ పాక్ వెళ్లొచ్చు.. మేం అమెరికా వెళ్లకూడదా?...** నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వార్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉంది.

**తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని ఖండించాలి...** తెలంగాణ సీఎంకు అనుమతి నిరాకరించడం అంటే ఒక వ్యక్తిగా రేవంత్ రెడ్డికి నిరాకరణ కాదు.. 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం.. తిరస్కరణ. ఈ తిరస్కరణకు కారణం గుజరాత్ ఆధిపత్యం. రాజకీయ కారణాలు చూపించి అనుమతి నిరాకరించడాన్ని తెలంగాణ సమాజం ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరముంది. తెలంగాణ సీఎంను అమెరికా వెళ్లకుండా అడ్డుకోవడమంటే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. రాష్ట్రం పట్ల కేంద్రం స్పష్టమైన వివక్షను చూపిస్తోంది. ఇది ఏమాత్రం సహించరానిది. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి" అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కావేరీ వివాదంపై... సుప్రీంకోర్టులో విచారణ..

### తమిళనాడుకు కీలక సూచన..

కర్ణాటక–తమిళనాడు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న కావేరీ జల వివాదంపై సుప్రీంకోర్టు సోమవారం కీలక సూచనలు చేసింది. కర్ణాటక నుంచి తమకు రావాల్సిన కావేరీ నీటి



వాటా సక్రమంగా అందడం లేదంటూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సమస్యపై ముందుగా కావేరీ జల నిర్వహణ ప్రాధికార సంస్థ (జఔహీూ)ను ఆశ్రయించాలని తమిళ నాడుకు సుప్రీంకోర్టు సూచించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం తమిళనాడు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించింది. కర్ణాటక నుంచి తమకు దామాషా ప్రకారం రావాల్సిన నీరు విడుదల కావడం లేదని తమిళనాడు తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు.. నీటి పంపిణీ, విడుదలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన కావేరీ జల నిర్వహణ ప్రాధికార సంస్థను ముందుగా ఆశ్రయించాలని తమిళనాడుకు సూచించింది. వర్షాభావం కారణంగా నీటి నిల్వలు తగ్గాయని కర్ణాటక చెబుతోంది. అయినా తమకు రావాల్సిన న్యాయమైన వాటా నీటిని విడుదల చేయాలని తమిళనాడు పట్టుపడుతోంది (ఖుతీఅఝఘుఝ ఖుఎఅశ్రీ ఛీఝఐబ ఝవతీ ఎఅఅంజూబవ). ఈ విషయమై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే సీడబ్ల్యూఎమ్ఏ ద్వారానే ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. సాంకేతిక లెక్కింపులు, నీటి నిల్వల ఆధారంగా సీడబ్ల్యూఎమ్ఏ తుది నిర్ణయం తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది.

## ఏఐతో డ్రైవర్లపై వేటు.. ఉబెర్‌పై రూ.9,224 కోట్ల జరిమానా!

**మనుషుల పర్యవేక్షణ లేకుండా ఏఐ సాయంతో ఉబెర్ సంస్థ తన డ్రైవర్లను తొలగించిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో డచ్ డేటా రెగ్యులేటరీ అథారిటీ ఉబెర్‌పై ఏకంగా రూ.9 వేల కోట్ల పైచిలుకు జరిమానా విధించింది.**

కింది స్థాయి ఉద్యోగి తప్పు చేస్తే పైఅధికారులు మొదట మందలిస్తారు. పద్ధతిని మార్చుకోమని హెచ్చరిస్తారు. అప్పటికీ తీరు మార్చుకోకపోతే ఉద్యోగం నుంచి తీసేస్తారు.




ఉద్యోగుల జీవితాలను తలకిందులు చేసే ఈ వ్యవహారాల్లో కంపెనీలు సాధారణంగా ఆచితూచి వ్యవహరిస్తుంటాయి. పట్టువిడుపుల ధోరణితో నిర్ణయాలు తీసుకుంటా యి. కానీ భావోద్వేగాలే లేని ఏఐకి ఈ నిర్ణయా ధికారాలను కట్టబెట్టిం దన్న ఆరోపణతో డచ్ డేటా ప్రొటెక్షన్ అథారిటీ ఉబెర్‌పై ఏకంగా 825 మిలియన్ యూరోల (రూ.9224 కోట్లు) జరిమానా విధించింది. యూరప్‌లో కొందరు ఉబెర్ డ్రైవర్‌ల సస్పెన్షన్, తొలగింపులు మనుషుల పర్యవేక్షణ లేకుండానే ఏఐ నిర్ణయాల మేరకు జరిగాయని డచ్ ప్రభుత్వం ఆరోపించింది. డ్రైవర్‌లకు ముందస్తు సమాచారం కూడా అందలేదని పేర్కొంది. కంప్యూటర్‌లు తీసుకున్న నిర్ణయాల కారణంగా కొందరు డ్రైవర్‌ల అకౌంట్స్ శాశ్వతంగా రద్దైపోయాయని చెప్పింది. 'మనుషుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపించే ఈ నిర్ణయాలను మానవుల పర్యవేక్షణ లేకుండా కంప్యూటర్లు స్వతంత్రగా తీసుకోకూడదు' అని డచ్ డేటా రెగ్యులేటరీ సంస్థ డిప్యూటీ ఛైర్‌పర్సన్ మానిక్ వెర్డియర్ వ్యాఖ్యానించారు. ఉబెర్ మాత్రం ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. కేవలం ఆటోమేటెడ్ కంప్యూటర్ వ్యవస్థల ఆధారంగా తాము ఏ డ్రైవర్ అకౌంట్‌ను శాశ్వతంగా రద్దు చేయలేదని స్పష్టం చేసింది. డ్రైవర్‌లపై సస్పెన్షన్స్ అన్నీ తాత్కాలికమైనవేనని పేర్కొంది. డ్రైవర్‌లను శాశ్వతంగా తొలగించే నిర్ణయాలపై మనుషుల పర్యవేక్షణ ఎప్పుడూ ఉంటుందని పేర్కొంది. ఈ నిర్ణయాలను సవాలు చేసే స్వేచ్ఛ డ్రైవర్‌లకు ఇచ్చామని కూడా తెలిపింది. ఈ జరిమానా విధింపుపై అప్పీలు చేసుకునేందుకు కూడా సిద్ధం అవుతోంది. ఇప్పటికే అనేక అమెరికన్ కంపెనీలపై ఐరోపా దేశాలు వివిధ కారణాలతో జరిమానాలు విధించాయి. ఈ జాబితాలోకి తాజాగా ఉబెర్ కూడా వచ్చి చేరింది. ఈ నేపథ్యంలో ఐరోపా సమాఖ్య తీరుపై అమెరికా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. తమ దేశ కంపెనీలను మాత్రమే కావాలని టార్గెట్ చేస్తున్నారంటూ ఇప్పటికే పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఉబెర్ ఉదంతం నేపథ్యంలో మనుషుల జీవితాలపై ఏఐ నియంత్రణ భవిష్యత్తులో ఎంతటి స్థాయికి చేరుకుంటుందో అన్న చర్చ మొదలైంది.

## అల్పపీడనం ఎఫెక్ట్.. ఏపీలోని ఈ ప్రాంతాల్లో వర్షాలు..

**ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్-యానాం, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతోపాటు.. ఈదురుగాలులతో పలు చోట్ల వర్షాలు కురిసే అవకాశం**

**బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కొనసాగుతున్నాయి. మంగళవారం, బుధవారం ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్-యానాం, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతోపాటు.. ఈదురుగాలులతో పలు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి.. ఈ తరుణంలో వాతావరణ శాఖ ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలపై కీలక అప్డేట్ ఇచ్చింది. అల్పపీడనం ప్రభావంతో ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఉరుములు, మెరుపులు.. ఈదురు గాలులతో కూడిన వర్షాలు దాదాపు అన్ని ప్రాంతాల్లో కురుస్తాయని వెల్లడించింది. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. పశ్చిమ బెంగాల్, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా, జార్ఖండ్, వాయువ్య బంగాళాఖాతం ప్రాంతాలలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం, ఈ రోజు (24 ఆగస్టు 2026) ఉదయం 08:30 గంటలకు గంగా తీర పశ్చిమ బెంగాల్, దానిని ఆనుకుని ఉన్న జార్ఖండ్, ఉత్తర ఒడిశా ప్రాంతాలపై కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉన్న చక్రవాత ఆవర్తనం సముద్ర మట్టం




నుండి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉండి, ఎత్తు పెరిగేకొద్దీ నైరుతి దిశగా వంగి ఉంది. ఇది రాబోయే 24 గంటల్లో జార్ఖండ్, ఉత్తర ఒడిశా మీదుగా దాదాపు వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉంది. దీంతోపాటు సముద్ర మట్టం వద్ద ఉన్న రుతుపవన ద్రోణి ప్రస్తుతం అమృత్‌సర్, నజీబాబాద్, షాజహాన్‌పూర్, వారణాసి, గంగా తీర పశ్చిమ బెంగాల్, దానిని ఆనుకుని ఉన్న జార్ఖండ్, ఉత్తర ఒడిశా ప్రాంతాలపై ఉన్న అల్పపీడన కేంద్రం మీదుగా, అక్కడి నుండి ఆగ్నేయ దిశగా ఉత్తర బంగాళాఖాతం వరకు విస్తరించి ఉంది. వీటి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో తేలికపాటి నుంచి మోస్తరు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ -- యానాం, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమ ప్రాంతాల్లో మంగళవారం, బుధవారం జోరుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే 3 గంటల్లో పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కర్నూలు జిల్లాల్లోని ఒకటి లేదా రెండు చోట్ల మెరుపులు, గంటకు 30–40 కి.మీ వేగంతో వీచే గాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# సంపాదకీయం

## తెలంగాణలోని మందుబాబులకు భారీ గుడ్ న్యూస్..!!

**త్వరలో కొత్త బ్రాండ్లు.. కిక్కే కిక్కు..**

**తెలంగాణలోని మందుబాబులకు గుడ్ న్యూస్. త్వరలో కొత్త మద్యం బ్రాండ్లను చూడవచ్చు. ప్రస్తుతం రాష్ట్రంలో దేశీయ, లోకల్ మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. రానున్న రోజుల్లో మరిన్ని బ్రాండ్లను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. త్వరలోనే ఇవి మార్కెట్లోకి రానున్నాయి.**

తెలంగాణలోని మందుబాబులకు గుడ్ న్యూస్. రాష్ట్రంలో త్వరలో ఫారిన్ బీర్లు, లగ్జరీ లిక్కర్ బ్రాండ్లు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఇంటర్నేషనల్ ప్రీమియం బ్రాండ్ల




మద్యంను కూడా ప్రవేశపెట్టేందుకు కంపెనీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో దేశీయ, లోకల్ బ్రాండ్ల కంపెనీల మద్యం అందుబాటులో ఉంది. త్వరలోనే ఇంటర్నేషనల్ ప్రీమియం బ్రాండ్లు కూడా రానుండటం మందుబాబులకు కిక్కిచ్చే న్యూస్‌గా చెప్పవచ్చు. విదేశీ బీర్లు, వైన్ వంటివి రాష్ట్రంలోకి రానున్నాయి. 18 కంపెనీలకు చెందిన 121 మద్యం బ్రాండ్లకు తాజాగా ఎక్సైజ్ శాఖ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఈ బ్రాండ్లకు సంబంధించిన వివరాలు ఎక్సైజ్ శాఖ వెబ్‌సైట్లో అందుబాటులోకి ఉన్నాయి.

**అందుబాటులో మరిన్ని బ్రాండ్లు..** ఈ కొత్త ఇంటర్నేషనల్ బ్రాండ్లను తెలంగాణలోని వినియోగదారులకు చేరువ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. ఇప్పటికే వీటికి సంబంధించి పబ్లిక్ నోటీస్ జారీ చేసిన రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్.. సెప్టెంబర్ 1 నాటికి అభ్యంతరాలు సమర్పించాలని కోరింది. కొత్తగా అనుమతి ఇచ్చిన మద్యం బ్రాండ్లలో సింగిల్ మార్ట్ విస్కీ, హెండ్రిక్స్ జిన్, మంకీ షోల్డర్, టైగర్ లాగర్ బీర్లు కొరియన్, జర్మన్ బ్రాండ్లు వంటివి ఉన్నాయి. ఇక దేశీయ బ్రాండ్లు అయిన ఆర్ఢోస్ కలెక్టివ్ మాల్ట్ విస్కీ, శంకర్ డిస్టిలర్స్ వర్చాస్ అమెరికన్ విస్కీ, స్మోక్ ల్యాబ్ వోడ్కా, రీకో, వల్లోన్ కంపెనీల బ్రాండ్ల కూడా అందుబాటులోకి రానున్నాయి. ఇక నుంచి రాష్ట్రంలో మందుబాబులకు మరిన్ని దేశీయ, విదేశీ బ్రాండ్లు అందుబాటులోకి రానుండటంతో.. ఇది కిక్కిచ్చే వార్తగా చెప్పవచ్చు.

**పెరగనున్న మద్యం ధరలు..** అటు రాష్ట్రంలో మద్యం ధరలు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మద్యం తయారీ కంపెనీలతో చర్చలు కూడా జరిపింది. కంపెనీల డిమాండ్లను కూడా పరిశీలించి అధ్యయనం చేపట్టింది. అనంతరం ధరలు పెంచాలని ప్రభుత్వానికి ఒక నివేదికను కూడా సమర్పించింది. ఈ నివేదికపై ప్రభుత్వం ప్రస్తుతం సమాలోచనలు చేస్తోంది. ఎంతవరకు ధరలు పెంచాలనే దానిపై చర్చలు జరుపుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకసారి మద్యం ధరలను పెంచింది. ఇప్పుడు మరోసారి పెంచితే మందుబాబుల నుంచి వ్యతిరేకత వస్తుందని ఆలోచిస్తోంది. అయితే మద్యం తయారీకి అయ్యే ఖర్చు పెరుగుతుందని, అంతర్జాతీయంగా ఉద్రిక్తతల వల్ల ఖర్చులు పెరిగిపోయాయని కంపెనీలు చెబుతున్నాయి. రానున్న రోజుల్లో మద్యం ధరల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే మందుబాబులకు బ్యాడ్ న్యూస్‌గా చెప్పవచ్చు.

## ఓపీటీకి లక్ష డాలర్ల ఫీజు..

**భారతీయులకు మరో షాకిచ్చేందకు రెడీ అవుతున్న యూఎస్**

భారతీయులకు మరో షాకిచ్చేందుకు ట్రంప్ సర్కారు సిద్ధమవుతోంది. హెచ్–1బీ వీసా, ఓపీటీ ప్రోగ్రామ్‌లపై కొత్త ఫీజు విధించేందుకు ఉద్దేశించిన ప్రతిపాదనలు రెడీ అయినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇందుకు సంబంధించి పాలనాపరమైన అనుమతుల కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించినట్టు ఇమిగ్రేషన్ న్యాయసేవల సంస్థ ఫ్రాగోమన్




తెలిపింది. అయితే, నూతన చార్జీలు ఏ స్థాయిలో ఉండబోతున్నాయి? అనే అంశం ఇంకా స్పష్టత రాలేదు. ఈ ప్రతిపాదనలపై అమెరికా గోప్యంగా వ్యవహరిస్తోంది. ఫ్రాగోమన్ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, ఓపీటీ ఫీజుకు సంబంధించిన ప్రతిపాదనను ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ (ఓఎమ్‌బీ) సమీక్ష కోసం ఆగస్టు 20న పంపించినట్టు తెలుస్తోంది. కొన్ని రకాల హెచ్–1బీ వీసా పిటిషన్ల ఫీజును పెంచే ప్రతిపాదనపై ఓఎమ్‌బీ ఇప్పటికే సమీక్ష పూర్తిచేసి, ఆగస్టు 19న గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఓపీటీ ఫీజు లక్ష డాలర్ల వరకూ పెంచే అవకాశం ఉందని మీడియా కథనాలను ఉటంకిస్తూ ఫ్రాగోమన్ పేర్కొంది. అయితే, ఈ విషయం పూర్తిస్థాయిలో నిర్ధారణ కాలేదని కూడా చెప్పింది. ఎంత ఫీజును నిర్ణయించాలనే విషయంలో డీహెచ్ఎస్ పలు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తోందని తెలిపింది. కొత్త హెచ్–1బీ వీసా దరఖాస్తుల ఫీజులను లక్ష డాలర్లను పెంచేందుకు ట్రంప్ సర్కారు గతంలో చేసిన ప్రయత్నాన్ని ఫెడరల్ కోర్టు అడ్డుకుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం కొత్త మార్గాల్లో ఫీజులను పెంచేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

## డ్రోన్ తగిలి హోంమంత్రి అనితకు స్వల్ప గాయం

**తిరుపతి:** తిరుపతిలో డ్రోన్ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో హోంమంత్రి అనితకు స్వల్ప గాయమైంది. తిరుపతిలో అమరావతి ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హోంమంత్రి హాజరయ్యారు.



ఈ కార్యక్రమంలో ఓ డ్రోన్‌ను ఎగరవేయగా.. బ్యాటరీ ఛార్జింగ్ తగ్గి కిందకి పడిపోయింది. దీంతో అక్కడే ఉన్న హోంమంత్రి అనిత చేయికి డ్రోన్ తగిలి స్వల్ప గాయమైంది.

## జీఎస్టీ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి వసూళ్లలో...

# తగినంత పురోగతి చూపించాలి

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అనంతపురము** : జీఎస్టీ పన్ను ఎగవేతదారుల నుండి సమర్థవంతంగా వసూలుకు అన్ని ప్రభుత్వ శాఖలు సహకరించి జీఎస్టీ వసూళ్లలో మెరుగైన ప్రగతి వచ్చేలా జీఎస్టీ





అధికారులు సమన్వయం చేసి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జీఎస్టీ వసూళ్లపై సంబంధిత అధికారులతో, మైనింగ్, జిల్లా పరిషత్, డీపీఓ, తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కన్స్ట్రక్షన్ పనులు, ఇతర పనులు నిర్వహించిన వాటికి, కాంట్రాక్టర్ బిల్లులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులకు సంబంధించి సోర్స్ వద్దనే జీఎస్టీ కట్ చేయాలని, అలా కాకుండా ఉన్నవాటిని జీఎస్టీ వసూలుకు వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి మెరుగైన ఫలితాలు చూయించాలని ఆదేశించారు. పన్ను ఎగవేతదారులలో నోటీస్ లు పంపినా వాటికి స్పందించని వారికి రెవెన్యూ రికవరీ నోటీస్ పంపి నిబంధనల మేరకు వసూలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ విజయలక్ష్మి, డీపీఓ నాగరాజ నాయుడు, జిల్లా మైనింగ్ అధికారి ఆదినారాయణ, ఎల్డీఎం మారుతి శ్రీనివాసులు, కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్లు రాకేష్, సుజిత, సురేందర్ రెడ్డి, డిసిటివోలు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితా ఖరారు

# నోటిఫికేషన్ విడుదల

**పుట్టపర్తి** : శ్రీ సత్యసాయి జిల్లాలోని 467 గ్రామ పంచాయతీలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల నిర్ధారణ, అలాగే రాజ, గా, దీజ ఓటర్ల జాబితాల నిర్ధారణకు రాష్ట్ర




ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వై. సమత ఒక ప్రకటనలో తెలిపారు.

పోలింగ్ కేంద్రాల నిర్ధారణ షెడ్యూల్

ఆగస్టు 23: ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురణ

ఆగస్టు 26 లోపు: అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ

ఆగస్టు 31: పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురణ

SC / ST / BC ఓటర్ల జాబితా షెడ్యూల్:

ఆగస్టు 25: పంచాయతీ నోటీస్ బోర్డులలో SC/ST/BC ముసాయిదా ఓటర్ల జాబితా

ఆగస్టు 26 నుండి 28 వరకు: అభ్యంతరాల దాఖలుకు అవకాశం

సెప్టెంబరు 07: గుర్తించబడిన ఓటర్లతో తుది జాబితా రూపకల్పన మరియు ప్రచురణ. ముసాయిదా పోలింగ్ కేంద్రాలు మరియు ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, సంబంధిత పంచాయతీ అభివృద్ధి అధికారి (గ్రాణా), ఉప మండల అభివృద్ధి అధికారి (ఋణా) లేదా మండల అభివృద్ధి అధికారి (ప్రాణా) కి తెలియజేయాలని సూచించారు.

## ఎమ్మెల్యే పరిటాల సునీతను

## మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎమ్మెల్సీ దంపతులు

# దళవాయి రమాదేవి, దళవాయి వెంకటనారాయణ

**అనంతపురం** : గవర్నర్ కోటాలో నూతనంగా ఎమ్మెల్సీగా ఎంపికైన దళవాయి రమాదేవి, ఆమె భర్త దళవాయి వెంకటనారాయణ అనంతపురంలో రాప్తాడు ఎమ్మెల్యే



పరి టాల సునీతను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్‌లు నూతన ఎమ్మెల్సీ దంపతులకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ టీడీపీ మొదటి నుంచి బీసీలు, మహిళలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పిస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలకు, బీసీలకు అత్యధిక అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన మహిళకు, వడ్డెర సామాజిక వర్గానికి చెందిన దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. రమాదేవి ఎమ్మెల్సీగా ప్రజలకు సేవలందిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

# వ్యవసాయ విద్యుత్ వేళల్లో తాత్కాలిక మార్పు

**సోలార్ పనుల నేపథ్యంలో కొత్త సమయాలు**

**వేముల** : వేల్పుల సబ్‌స్టేషన్ పరిధిలో సోలార్ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో భ్రమరాంబ ఫీడర్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో తాత్కాలికంగా మార్పులు




చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 4 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు. సోలార్ పనులు పూర్తయ్యే వరకు కొత్త వేళలు అమల్లో ఉంటాయని తెలిపారు. రైతులు మారిన సమయాలను గమనించి వ్యవసాయ పనులను అందుకు అనుగుణంగా చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాపై ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

# రైతులకు కనీసం ఒక పంట పండించుకునే అవకాశం

## కల్పించాలని కూటమి ప్రభుత్వానికి డిమాండ్ : మాజీ ఎమ్మెల్యే కాటసాని

**బనగానపల్లె ఆగస్టు 24 పల్లె సాక్షి :** బనగానపల్లె మండలం రైతులకునీరుఅందించాల్సింది పోయి. రైతులకు కన్నీళ్లు పెట్టిస్తున్న కూటమి ప్రభుత్వం పోతిరెడ్డి పాడు ప్రాజెక్టును పరిశీలించేందుకు వెళ్తున్న వైఎస్ఆర్సీపీ నేతలను పోలీసులు అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పోతిరెడ్డి పాడు వద్ద నీటి పరిశీలనకు వెళితే కూటమి ప్రభుత్వానికి ఎందుకు అంత భయం మేమేమైనా ఉగ్రవాదులమా నక్సలైట్లమాపోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని పెంచి, గోరకల్లు రిజర్వాయర్‌ను నిర్మించి రాయలసీమకు నీటి భద్రత కల్పించిన ఘనత నాటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విద్యుత్ పేరుతో తెలంగాణకి నీటి తరలింపురాయలసీమలో 52 మంది ఎమ్మెల్యేలలో 45 మంది కూటమి కి చెందిన ఎమ్మెల్యే లేరాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ మీద ఎందుకు అంత చులకనరాయలసీమ అభివృద్ధిని మీరు ఆకాంక్షించడం లేదారాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయడానికి ప్రభుత్వం పై రాయలసీమ కు చెందిన కూటమి మంత్రులు,ఎమ్మెల్యేలు ఎందుకు వత్తిడి తీసుకురావడం లేదు

**రైతులకు నీరు అందించకుండా రైతులనే నిందిస్తారా...**

నంద్యాల జిల్లాలో 7 మంది శాసన సభ్యులను ప్రజలు అందిస్తే మీరు చేస్తున్న న్యాయం ఇదేనా.నాడు వైఎస్సార్సీపీ హయంలో శ్రీశైలం రిజర్వాయర్ లో నీరు పూర్తి స్థాయిలో లేనప్పటికీ విడతల వారిగా రైతులకు నీరు అందించిన ఘనత నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీశైలం





జలాల్లో మనకు దక్కాల్సిన వాటాను పూర్తిగా వినియోగించుకోవాలని డిమాండ్ చేసిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎస్ఆర్బీసీకి నీటిని విడుదల చేస్తే చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి రైతులకు, పశువులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది రాయలసీమలోని రిజర్వాయర్లను నింపి రైతులకు కనీసం ఒక పంట పండించుకునే అవకాశం కల్పించాలని కూటమి ప్రభుత్వానికి డిమాండ్ చేసిన కాటసాని రామిరెడ్డి రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై రైతుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తాం.రాయలసీమకు రావాల్సిన నీటి హక్కులను సాధించే వరకు మా పోరాటం ఆగదు.రైతులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తాం ఈ కార్యక్రమంలో పాల్గొన్న నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాజీ మంత్రి శైలజానాథ్ ,శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి ,ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి నందికొట్కూరు ఇంచార్జీ ధారసుధీర్, నంద్యాల, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలకు చెందిన రైతులు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దకడబూరు గ్రామానికి చెందిన...

# ఎం.రత్నమ్మ అదృశ్యం

**ఆచూకీ కనపడినచో కుటుంబ సభ్యులకు తెలియజేయండి**

**పెద్దకడబూరు ఆగస్టు 24 (పల్లెసాక్షి ):** పెద్దకడబూరు గ్రామానికి చెందిన యం.రత్నమ్మ W/o యం.జాన్ తేది: 17-08-2026 సోమవారం,గుత్తి శాల నుండి తప్పి పోయినదని




ఆమె కుటుంబ సభ్యులు సోమవారం తెలియజేశారు. ఈమే మనసిక పరిస్థితి బాగలేదు. ఈమే ఆచూకి తెలిపవలసిన వారి కుటుంబసభ్యుల వారి నంబర్లు. అంజినయ్య -9618386116 అనిల్ -9550451562 ఆదామ్ -9866907630 నాగరాజు - 9908614438 తెలిపారు.

# బాలుర వసతిగృహంలో ఆర్డీఓ

**నరేంద్ర నాథ్ రెడ్డి ఆకస్మిక తనిఖీ**

**బనగానపల్లి ఆగస్టు 24 పల్లె సాక్షి** బనగానపల్లె పట్టణంలోని కొండపేట ప్రభుత్వ బాలుర ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని ఆర్డీఓ నరేంద్రనాథ్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ





చేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన ఆహారం అందుతున్నదా, నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదిని పరిశీలించి, ఆహారాన్ని స్వయంగా రుచి చూశారు. ప్రభుత్వం హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించి ందని ఆర్డీఓ తెలిపారు. తనిఖీలో హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

# స్వామి వారికి విరాళాలు అందజేత...!!

## రూ,74,905/-

**కౌతాళం, ఆగస్ట్,24,టుడే పల్లెసాక్షి :** ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కౌతాళం మండలంలో వెలసిన శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ అభివృద్ధి కొరకు కర్నూలు జిల్లా సి,బెళగల్ గ్రామ



వాస్తువ్యాలైన శ్రీమతి మంగమ్మ గారు శ్రీ స్వామివారి దేవాలయ అభివృద్ధి కొరకు గురువారం రూ,74,905/- రూపాయలు విరాళముగా చెల్లించి ఉన్నారు. వారికి దేవస్థానం వారు శ్రీ స్వామి వారి శేష వస్త్రములు లడ్డు ప్రసాదములు మరియు బాండ్ పేపర్ ఇచ్చి దర్శనం కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో దేవస్థాన పర్యవేక్షకులు ఖ. వెంకటేశ్వరరావు గారు పాల్గొనడం జరిగినది.

# నైపుణ్య శిక్షణలను సద్వినియోగపరుచుకోవాలి

**ఆనంద్ కుమార్, ఆర్డీవో పెనుగొండ**

**పెనుకొండ** : ఈరోజు స్థానిక పెనుగొండలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐదు రోజులపాటు సోలార్ స్కిల్లింగ్ పై శిక్షణ తీసుకున్న 30 మంది యువతీ, యువకులకు నైపుణ్య శిక్షణ సర్టిఫికెట్లను ప్రధానం చేయడం. ఈ శిక్షణలో కియా ఇండియా వారి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో యునైటెడ్ వే, మరియు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు శిక్షణలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనటువంటి పెనుగొండ ఆర్డిఓ




ఆనంద్ కుమార్ గారు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం సహకారంతో మరియు కియా ఇండియా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ భాగంగా యువతీ యువకులకు ఐదు రోజులపాటు సోలార్ స్కిల్లింగ్ పై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ శిక్షణను ఉపయోగించుకొని ఉపాధి అవకాశాలు పొందాలని తెలియజేశారు. అదేవిధంగా రెగ్యులర్ గ్రాడ్యుయేషన్ తో పాటుగా , యువతీ యువకులు వారి స్కిల్ సెట్స్ ని పెంపొందించుకోవలసినదిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల జిల్లా అధికారి నాగరాజ, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ శశికళ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పండుగలను ప్రశాంత వాతావరణంలో

# జరుపుకోవాలి

**సీఐ,ప్రవీణ్ కుమార్, ఎస్సై దుగ్గిరెడ్డి**

**బనగానపల్లె ఆగస్టు 24 పల్లె సాక్షి :** బనగానపల్లె పట్టణంలో మీలాద్ ఉన్ నబి, వినాయక చవితి పండుగలను అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బనగానపల్లె పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ సూచించారు. సోమవారం బనగానపల్లె పట్టణ పోలీస్ స్టేషన్‌లో పట్టణ శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, రానున్న మీలాద్ ఉన్ నబి, వినాయక చవితి పండుగల నేపథ్యంలో అన్ని మతాల పెద్దలు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు శాంతి, సామరస్యాన్నికాపాడేందుకు సహకరించాలని కోరారు.వినాయక మండపాల ఏర్పాటుకు ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా పోలీసుల అనుమతి



పొందాలని తెలిపారు. మండపాలను రాకపోకలకు అంతరాయం కలిగే విధంగా రోడ్లపై ఏర్పాటు చేయరాదని, ఇతర మతాల వారికి లేదా ప్రజలకు ఇబ్బంది కలిగించే చర్యలకు పాల్పడరాదని సూచించారు. ప్రధాన కూడళ్లలో వివాదాలకు అవకాశం కలి గించే విధంగా మతపరమైన జెండాలు ఏర్పాటు చేయకుండా ఉండాలని, పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని తెలిపారు.పోలీసు శాఖ సూచనలు, నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించి పండుగలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని సీఐ కోరారు.ఈ సమావేశంలో ఎస్సై దుగ్గిరెడ్డి, కల్పనతో పాటు వివిధ మతాల పెద్దలు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

APTEL 2022 / 16169
టుడే పల్లె సాక్షి
కర్నూలు
నంద్యాల

# కోసిగి [బెళగల్లు] దగ్గర రోడ్డు ప్రమాదం

**ఒకరికి తీవ్ర గాయాలు..**

**కోసిగి టుడే (పల్లె సాక్షి) ఆగస్టు 24 :** ఆలూరు మండలం పెద్దహోతూరుకు చెందిన ఉరుకుందప్ప కుమారుడు చంద్రశేఖర్ (23) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు.




మంత్రాలయం మండలం చెట్నపల్లి చెందిన తన స్నేహితుడు వీరేంద్రతో కలిసి చంద్రశేఖర్ ఎమ్మిగనూరులో కార్పెంటర్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో, సోమవారం ఇద్దరూ కలిసి బైక్‌పై ఉరుకుంద క్షేత్రంలో ఉన్న ఆలయ దర్శనానికి బయలుదేరారు.వారి బైక్ బెళగల్లు సమీపానికి చేరుకోగానే, రోడ్డుపై అకస్మాత్తుగా ఒక వృద్ధురాలు అడ్డం వచ్చింది. ఆమెను తప్పించబోయే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్ తలకు బలంగా దెబ్బతగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అత్యవసర వాహనానికి సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ ఈఎంటీ రామకృష్ణ, పైలట్ భీమేష్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడైన చంద్రశేఖర్‌కు అంబులెన్స్‌లోనే ప్రాథమిక చికిత్స అందిస్తూ, మెరుగైన వైద్యం కోసం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చంద్రశేఖర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## వ్యవసాయ పనుల్లో...

# రైతులు కూలీలు బిజీబిజీ

**ఉయ్యాలవాడ, ఆగస్టు 24: (టుడే పల్లె సాక్షి)** వర్షాభావ పరిస్థితులలో ఖరీఫ్ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్న రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొంది. గత



మూడు రోజులుగా వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోనే అత్యధికంగా ఉయ్యాలవాడ మండలంలో 35.4 ఎమ్ ఎమ్ వర్షపాతం నమోదయింది. భూమి పదునయ్యే వర్షాలు కురవడంతో రైతులు, వ్యవసాయ కూలీలు పంట పొలాల్లో బిజీ బిజీ అయ్యారు. గతంలో రైతులు మైదుకూరు పట్టణంలో నర్సరీలలో ఇచ్చిన మిరప విత్తనాలను అందజేసి వచ్చారు. సోమవారం ఉదయం నర్సరీల వద్దకు రైతులు వెళ్లి అక్కడినుండి ఎకరాకు 18 వేల మొక్కల చొప్పున తీసుకొని వచ్చి, కూలీలతో కలిపి రూ. 20 వేలు ఖర్చు చేసి మిరప పంట సాగు చేశారు. రాబోయే రోజుల్లో మంచి వర్షాలు కురిసి పంట దిగుబడులు బాగా వచ్చేలా దేవునిపై భారం వేసి మొక్కలు నాటినట్లు రైతులు పేర్కొన్నారు.

## పిల్లల ఆరోగ్యం పై అవగాహన అవసరం

**బెల్లంకొండ ఆగస్టు 24,పల్లె సాక్షి,** క్రోసూరు ప్రాజెక్ట్ పరిధిలోని బెల్లంకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జ్ఞాన జ్యోతి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా




పిల్లల ఆరోగ్యం,పోషకాహారం రక్షణ,లింగ సమానత్వం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. పిల్లల్లో పోషకాహార లోపాలను గుర్తించడం,అనుబంధ పోషకాహారం, వయసుకు అనుగుణంగా టి హెచ్ ఆర్,హెచ్ సి ఎం,ప్రయోజనాలు సూక్ష్మ పోషకాల పంపిణీ,ఎదుగుదల పర్యవేక్షణ తదితర అంశాలను వివరించారు. పిల్లల పరిశుభ్రత వ్యాధుల నివారణ ఆడ-మగ తేడా లేకుండా సమానంగా చూడడం,థర్డ్ జెండర్ల పట్ల అవగాహన కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. అంగన్వాడి కార్యకర్తలు తల్లిదండ్రుల భాగస్వామ్యంతో పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తోడ్పడవచ్చు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. బాల త్రిపుర సుందరి,వనజ, ఉపాధ్యాయులు పి.శివ నాగేంద్రం,కే.ఆంజనేయులు,ఎం. కృష్ణకుమారి,అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిండు మనస్సుతో నిండు ప్రాణానికి...

# చికిత్స కోసం ఆర్థిక సహాయం

**విజయ్ కుటుంబానికి అన్ని విధాలుగా వైసీపీ అండగా ఉంటుంది : మంత్రాలయం శాసనసభ్యులు వై. బాలనాగిరెడ్డి**

**అపదలో ఆదుకోనెందుకు మా కుటుంబం ఎప్పుడు ముందుంటాం**

**రాష్ట్ర నిర్వహణ కమిటీ సభ్యులు / పత్తికొండ నియోజకవర్గం పరిశీలకులు వై.సీతారామిరెడ్డి రాంపురం రెడ్డి సోదరల కుటుంబం**

**ఆదోని నియోజకవర్గం పరిశీలకులు ఆర్ పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి**

**విజయ్ చికిత్స కోసం వైసీపీ నేతలు 85000 ఆర్థిక సహాయం**

**పెద్దకడబూరు ఆగష్టు 24 (పల్లెసాక్షి )** చాలా రోజుల నుంచి వాస్కులర్ వ్యాధితో బాధపడుతున్న పెద్దకడబూరు గ్రామానికి చెందిన హరిజన విజయ్ కు మంత్రాలయం శాసనసభ్యులు



వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యనిర్వాహక మండలి సభ్యులు /పత్తికొండ నియోజకవర్గం పరిశీలకులు వై.సీతా రామిరెడ్డి అలాగే మండల వైస్సార్సీపీ నాయకులు అందరు కలిసి చికిత్స నిమిత్తం 85000 రూపాయలు భార్య మారెమ్మ కు సోమవారం ఆర్థిక సహాయం రాష్ట్ర కార్యనిర్వాహక మండలి సభ్యులు ఆదోని నియోజకవర్గం పరిశీలకులు ఆర్.పురుషోత్తం రెడ్డి, మండల కన్వినర్ బి.రామ్ మోహన్ రెడ్డి,మంత్రాలయం నియోజకవర్గం బూత్ కమిటీ అధ్యక్షులు బి. చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో విజయ్ చికిత్స కోసం నగదును అందజేశారు. ఆపదలో ఆదుకునేందుకు మా కుటుంబం ఎల్లప్పుడూ ఉంటుంది... మంత్రాలయం నియోజకవర్గం ప్రజలుకు ఎ కష్టం వచ్చిన మా రాంపురం రెడ్డి కుటుంబం ఎప్పుడు సహాయం చేసేందుకు ముందుంటారని మంత్రాలయం శాసనసభ్యులు వై.బాలనాగిరెడ్డి



తెలిపారు. అలాగే నా నియోజకవర్గం ప్రజలుకు నిరంతరం వైసీపీ ప్రభుత్వం అండగా ఉంటూ దని అలాగే మేము సహాయం చేసేది చిన్నదైనా మానవత్వానికి నిదర్శనంగా మా కుటుంబం ఆదుకుంటుందని వారు తెలిపారు.ఒక నిండు ప్రాణానికి సహాయం చేయడం ప్రతి ఒక్కరు ముందు రావాలని నిరుపేద కుటుంబాలలో ఇలాంటివి జరగడం చాలా ఇబ్బంది కాబట్టి మన వ్యక్తికి మనం సహాయం చేయడంలో ఎంతో వారికి రుణపడి ఉండాలని వారు కోరారు. సహాయం చేయడం ధర్మమైతే ప్రాణాన్ని కాపాడుకోవటంలో కూడ ఒక ధర్మం అని విజయ్ ఆపరేషన్ బాగా జరగాలని అలాగే చికిత్స జరిగే సమయంలో దేవుని దీవెనలు ఆయనకు కలగాలని వారు ఆకాంక్షించారు.

**నా భర్త విజయ్ ఆపరేషన్ కు ఆర్థిక సహాయం అందించినందుకు మీకు రుణపడి ఉంటాం...** విజయ్ భార్య మారెమ్మ మంత్రాలయం శాసనసభ్యులు వై.బాలనాగిరెడ్డికి పత్తికొండ నియోజకవర్గం పరిశీలికులు వై. సీతారామరెడ్డికి



ఆదోని నియోజకవర్గం పరిశీలికులు ఆరు.పురుషోత్తం రెడ్డి,మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి కి,చంద్రశేఖర్ రెడ్డికి వైసీపీ ముఖ్య మండల నాయకులు నా భర్తకు ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికి పేరు పేరుగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ నా భర్త త్వరగా కోలుకోవాలని మరియు ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికి మా కుటుంబం ఎప్పుడు రుణపడి ఉంటామని విజయ్ భార్య మారెమ్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమం ,సీనియర్ నాయకులు ఆర్ రామలింగారెడ్డి, దొడ్డిమేకల మాజీ సర్పంచ్ చంద్రశేఖర్,రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీపీ రఘురామ్, మండల విభాగం అధ్యక్షులు బ్రహ్మయ్య ఆచారి, తాలూకా విభాగం అధ్యక్షులు ముక్కరన్న,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు అర్లప్ప,వైసీపీ గ్రామ నాయకులు ప్రసాద్,మేకల రాజు, సుందరం, ఏసన్న,కుమార్, మారెప్ప, మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాఘవేంద్ర స్వామి వార్ల

# హుండీ లెక్కింపు...

**రూ,2,81,69,135**

**మంత్రాలయం టుడే పల్లెసాక్షి, ఆగస్టు,24,** ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో వెలసిన శ్రీ రాఘవేంద్ర స్వామి వార్ల హుండీ లెక్కింపు గురువారం మేనేజర్ ఆధ్వర్యంలో



చేపట్టారు.ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ 19,రోజులకు గాను రూ, 2,73,34,635, కాయిన్స్ రూ,.8,34,500, మొత్తం టోటల్, రూ,2,81,69,135 అలాగే గోల్డ్, 94,గ్రామ్స్,సిల్వర్,515 గ్రామ్స్,తో కలిపి కేవలము 19,రోజులకే మాత్రమే హుండీ ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు విలేకరులకు తెలిపారు.

## (SIR) ఓటర్ల సర్వేలో జరిగిన తప్పులను సరిచేయాలి..

**చిన్నభూంపల్లి గ్రామ ప్రజలు..**

**కోసిగి టుడే ( పల్లె సాక్షి) ఆగస్టు 24,** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కోసిగి మండలం చిన్నభూంపల్లి గ్రామంలో పెద్ద ఎత్తున ఓట్ల మ్యాపింగ్ తప్పులు దొర్లినట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో మొత్తం 2500 మంది ఓటర్లు ఉండగా, దాదాపు 780 మందికి పైగా నోటీసులు జారీ అయ్యాయి.అయితే, క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు



(బీఎల్ఓ) నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే అర్హులైన ఓటర్ల డేటా తప్పుగా మ్యాపింగ్ అయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై బాధితులు స్పందిస్తూ, తాము సరైన ధృవీకరణ పత్రాలు అందించినా అధికారులు పట్టించుకోలేదని, దీనివల్ల వందలాది మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఓటర్ల జాబితాలో గందరగోళాన్ని నివారించి, తప్పులను తక్షణమే సరిచేసి తమకు న్యాయం చేయాలని చిన్నభూంపల్లి గ్రామ ప్రజలు కోసిగి తహసీల్దార్‌కు అధికారికంగా ఫిర్యాదు చేశారు.

# విలేకరుల ముసుగులో నకిలీ పట్టాల దందా

**నకిలీ పట్టాల దందా నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోండి...బహుజన సేన సమితి జిల్లా కమిటీ ప్రతినిధి రాజు వినతి**

**పెద్దకడబూరు ఆగస్టు 24 :(పల్లెసాక్షి ) :** పెద్దకడబూరు మండలంలో విలేకరుల ముసుగులో అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన సేన సమితి జిల్లా కమిటీ ప్రతినిధి రాజు శనివారం పెద్దకడబూరులోని తహసీల్దార్ వలిబా షాకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నకిలీ ఇంటి పట్టాలు,ప్రభుత్వ పత్రాల పేరుతో మోసాలు,అధికారుల సంతకాల ఫోర్జరీ, అమాయక ప్రజల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.కొంతమంది వ్యక్తులు తమను విలేకరులుగా పరిచయం చేసుకుంటూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అధికారులు, సిబ్బంది, అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. తమకు అనుకూ లంగా వ్యవహరించకపోతే సమాచార హక్కు చట్టాన్ని (ఆర్‌టీఐ) అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. అదేవిధంగా పేదలకు ఇంటి పట్టాలు ఇప్పిస్తామంటూ ముందుగా నగదు తీసుకుని,



పట్టాలు మంజూరైన తర్వాత మిగతా మొత్తం చెల్లించాలంటూ ఒప్పందాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. బదిలీ అయిన లేదా పదవీ విరమణ చేసిన తహసీల్దార్ల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలు సృష్టించే వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్ లేని పత్రికల పేరుతో పనిచేస్తున్న వ్యక్తులు, నకిలీ గుర్తింపు కార్డులు ఉపయోగిస్తున్నవారు,విలేకరి పేరుతో ప్రజలను మోసం చేస్తున్న వారిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నిజమైన జర్నలిస్టుల ప్రతిష్ఠకు భంగం కలిగించే ఇలాంటి చర్యలను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అమాయక ప్రజలు ఇలాంటి వ్యక్తుల మోసాలకు గురికాకుండా అవగాహన కల్పించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో నకిలీ పత్రాల దందాపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలన్నారు. అక్రమ వసూళ్లు, నకిలీ పట్టాలు, ఫోర్జరీ పత్రాల వ్యవహారాలు నిజమని తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజు పాల్గొన్నారు.

EDITED&PUBLISHED AND OWNED BY EDITOR:V.LINGAMURTHY. PUBLISHED AT DOOR NO:4/83,BC COLONY, KAMBALADINNE (V), PEDDAKADUBUR (M), KURNOOL (D), ANDRA PRADESH, PINCODE:518360.MURTHY OFFSET PRINTERS D.NO:4/83,KAMBALADINNE (V), PEDDAKADUBUR (M), KURNOOL (D), ANDRA PRADESH, CONTACT NO:9000367833.RNI,APTEL/2022/82037 E-MAIL ID:pallesakshi2022@gmail.com